ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య

జిల్లా వార్తలు

5

గురువారం 8 ఆగస్టు 2024

ఐదేళ్లు దోచుకున్నదెంత?

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో పలుచోట్ల గతంలో వైసీపీ నాయకులు అక్రమంగా ఉంచిన ఇసుక నిల్వలను జిల్లా అధికార యంత్రాంగం స్వాధీనం చేసుకుంది. సుమారు 60 వేల టన్నుల అక్రమ ఇసుక నిల్వలను జిల్లా వ్యాప్తంగా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.30 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మిగిలిన ఈ ఇసుకే రూ.30 నుంచి 40 కోట్ల వరకు ఉంటే ఇక ఐదేళ్ల పాటు వైసీపీ నాయకులు విచ్చలవిడిగా దోచుకున్నది ఎన్ని వందల కోట్ల రూపాయలో.? అని జనం ముక్కున వేలేసుకుంటున్నారు.





ములకలచెరువు మండలంలో అధికారులు స్వాధీనం చేసుకున్న ఇసుక నిల్వలు (ఫైల్)

- మింగగా మిగిలిందే రూ.30 కోట్లు
- వైసీపీ నాయకులకు ఇసుకే ప్రధాన ఆదాయమార్గం
- జిల్లాలో పలుచోట్ల ఇసుక డంపుల స్వాధీనం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వైసీపీ నాయకులకు ఇసుక అక్రమ రవాణానే ప్రధాన ఆదాయమార్గంగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రత్యేకించి ఒకరో.. ఇద్దరో వైసీపీ నాయకులు అని, ఫలానా నియోజకవర్గంలో మాత్రమే ఇసుక అక్రమ రవాణా జరిగిందనే చెప్పడానికి వీలు లేదు. జిల్లా వ్యాప్తంగా దాదాపు ప్రతి నియోజకవర్గంలోనూ.. ఇసుక విరివిగా లభ్యమయ్యే చోట ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగింది. నదులే కాకుండా. వాగులు, వంకలు ఇలా ఎక్కడ దొరికితే అక్కడ ఇసుకను తోడేసి కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించారు. బడా నేతలు వాళ్ల స్థాయికి తగ్గట్టే సంపాదించుకున్నారు. మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, రాజంపేట, రాయచోటి నియోజకవర్గాల్లో కేంద్ర పర్యావరణ నిబంధనలను పట్టించుకోకుండా ఇసుకను ఇష్టానుసారం తోడేశారు. చాలా వరకు అభివృద్ధి పనుల పేరుతో యంత్రాలతో తవ్వి టిప్పర్లతో తరలించి సొమ్ము చేసుకున్నారు. అధికారికంగా ప్రకటించిన ఇసుక రీచ్‌లలో సైతం అప్పటి అధికార పార్టీ నాయకుల ఇసుక అక్రమదందా నిరాటంకంగా సాగింది. మదనపల్లె నియోజకవర్గం నిమ్మనపల్లె మండలంలోని బాహుదా నది, తంబళ్లపల్లె నియోజకవర్గం పీటీఎం మండలంలో పాపాఘ్నినది, రాయచోటి నియోజకవర్గం మాండవ్యానది, రాజంపేట నియోజకవర్గం పింఛా, చెయ్యేరు నదుల నుంచి ఐదేళ్ల పాటు లక్షల టన్నుల ఇసుక అక్రమ రవాణా కొనసాగింది. బి.కొత్తకోటలోని ఏరు నుంచి భారీగా ఇసుకను తవ్వేశారు. తంబళ్లపల్లె, ములకలచెరువు గుండా ప్రవహించే పెద్దేరులో లక్షల టన్నుల ఇసుకను తవ్వేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు సమీపంలోని కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకున్నారు.

పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో పెద్దిరెడ్డి కుటుంబానికి అడ్డు చెప్పే నాయకులు, అధికారులు లేకపోవడంతో మూడు టిప్పర్లు, ఆరు ట్రాక్టర్లు అనే రీతిలో ఇసుక అక్రమ రవాణా సాగింది. రేయింబవళ్లు యంత్రాలతో ఇసుకను తరలించినా పోలీసులు, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదనే ఆరోపణలు ఉన్నాయి. రాజంపేట నియోజకవర్గంలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోవడానికి, అక్కడి కొందరు వైసీపీ ముఖ్య ప్రజాప్రతినిధుల ఇసుక అక్రమ వ్యాపారమే కారణమనే ఆరోపణలూ ఉన్నాయి. పీలేరు నియోజకవర్గంలోని పీలేరు, కేవీపల్లె, కలకడ, కలికిరి, వాల్మీకిపురం మండలాల్లో గత ఐదేళ్లలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగింది. కలికిరి మండలం పారపట్ల, చీకటిపల్లె, పల్లవోలు, గుండ్లూరు, అద్దవారిపల్లె, మహల్ గ్రామాల సమీపంలో అధికారికంగా ఇసుక రీచ్ ఏర్పాటు చేసినప్పటికీ అక్కడి నుంచి అక్రమ కార్యకలాపాలు సాగినట్లు ఆరోపణలు ఉన్నాయి. దొంగ బిల్లులతో వైసీపీ నాయకులు రోజుకు సగటున 30 ట్రాక్టర్లు, 10 టిప్పర్లలో ఇసుకను అక్రమంగా అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఒక్కొక్క రీచ్ నుంచి సుమారు 3 లక్షల టన్నుల ఇసుకను తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ లెక్కన ఆరు రీచ్‌ల నుంచి 18 లక్షల టన్నుల ఇసుక దోపిడీ చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. (ఒక ట్రాక్టరులో సుమారు 5 టన్నులు, ఒక టిప్పరులో 25 నుంచి 30 టన్నుల ఇసుక లోడ్ చేసేవారు.) బాలంవారిపల్లె, శివరామాపురం, పీలేరు, బోడుమల్లువారిపల్లె గ్రామాల సమీపంలోని పింఛా నది నుంచి ఐదేళ్లలో సుమారు 50 వేల టన్నులు అక్రమంగా అమ్మి సొమ్ము చేసుకున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. వాల్మీకిపురం మండలంలోని బాహుదా నదీ పరీవాహక ప్రాంతాలైన కూరపర్తి, మాధవరంపల్లె, మంచూరు, చింతపర్తి గ్రామాల నుంచి సుమారు లక్ష టన్నుల ఇసుకను వైసీపీ నాయకులు అక్రమంగా విక్రయించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నియోజకవర్గం గుండా ప్రవహించే బాహుదా నది నుంచి ఇష్టారాజ్యంగా ఇసుకను తరలించారు. జిల్లాలో ఓ నాలుగైదు ప్రాంతాల్లో పెద్దస్థాయిలో రాత్రింబవళ్లు యంత్రాలతో తవ్వి తరలించారు. స్థానికంగా ఉండే వంకలు, వాగులు, చెరువులు, కుంటల్లోనూ ఇసుకను తరలించేశారు. ఐదేళ్ల పాటు ఎవరూ అడ్డుచెప్పకపోవడంతో జిల్లాలో పలుచోట్ల వైసీపీ నాయకులు భారీ ఎత్తున ఇసుకను నిల్వ చేశారు. ఎన్నికలకు ముందు పాపాఘ్ని, పెద్దేరు కాలువలో పలుచోట్ల వైసీపీ నాయకులు ఇసుకను తోడి కాలువల పరీవాహక ప్రాంతాల్లో ముందస్తు డంప్‌లు ఏర్పాటు చేశారు.

స్వాధీనం చేసుకున్న ఇసుక నిల్వలు

ములకలచెరువు మండలం రాజుగారిపల్లి, దేవళచెరువు సమీపాల్లో మే 29వ తేదీ 1212 టన్నుల ఇసుకను సీజ్ చేశారు. ములకలచెరువు మండలం సోంపల్లె పంచాయతీ రెడ్డివారిపల్లె సమీపంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పోగు చేసిన 41,208 టన్నుల ఇసుకను జూలై 9వ తేదీ సీజ్ చేశారు. పెద్దతిప్పసముద్రం మండల సదుం పంచాయతీ చంద్రాయనిపల్లె సమీపంలో జూలై 11వ తేదీ 60 టన్నుల ఇసుకను సీజ్ చేశారు. ములకలచెరువు మండలం సోంపల్లె పంచాయతీ అడివిచెరువు రోడ్డులో జూలై 15వ తేదీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పోగు చేసిన 3303 టన్నుల ఇసుకను సీజ్ చేశారు. బి.కొత్తకోట మండలం శెట్టిపల్లె సమీపంలో జూలై 15న 5208 టన్నుల ఇసుకను సీజ్ చేశారు. బి.కొత్తకోట మండలం తుమ్మణంగుట్ట పంచాయతీ సుంకంవారిపల్లె సమీపంలో జూలై 18న 423 టన్నులు సీజ్ చేశారు. తంబళ్లపల్లె ఆర్టీసీ బస్టాండు సమీపంలో జూలై 18న 825 టన్నుల ఇసుకను సీజ్ చేశారు. మొత్తం 52,239 టన్నులు గత ప్రభుత్వ విలువ ప్రకారం సుమారు రూ.24 కోట్లు ఉంటుందని అంచనా. ఇదే కాకుండా రాయచోటి, రాజంపేట నియోకవర్గాలలో కూడా పలుచోట్ల ఇసుక నిల్వలను అధికారులు సీజ్ చేశారు. ఈ లెక్కన కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారులు స్వాధీనం చేసుకున్న ఇసుక విలువ సుమారు రూ.30 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

ఈ లెక్కన ఐదేళ్ల పాటు వైసీపీ నాయకులు జిల్లావ్యాప్తంగా ఇసుకలో దోచుకున్న మొత్తం ఎంతుంటుందో?. లెక్కించడమే కష్టంగా ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలి

- జాతీయ చేనేత దినోత్సవ ర్యాలీలో కలెక్టర్



కలెక్టర్ కార్యాలయం వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, జేసీ, తదితరులు

రాయచోటి (కలెక్టరేట్), ఆగస్టు 7: ప్రజలందరూ చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించి వాటిపై అవగాహన కలిగి ఉండాలని జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. చేనేతలకు అవగాహన కోసం బుధవారం ఉదయం 9:30 గంటలకు కలెక్టరేట్ అవరణంలో ర్యాలీని జెండా ఊపి కలెక్టర్‌తో పాటు జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఓకల్ ఫర్ లోకల్ నినాదంతో ప్రజలందరూ చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలన్నారు. దేశీయ పరిశ్రమలను ప్రోత్సహించడానికి 1905 ఆగస్టు 7వ తేదీ స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు. అప్పటి నుంచి ఆగస్టు 7 తేదీ జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. చేనేత రంగం ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి, చేనేత మీద ఆధారపడి జీవిస్తున్న ఎంతోమంది నేతన్నల సేవలు గుర్తించి జాతీయ చేనేత దినోత్సవ అవగాహన ర్యాలీని చేపట్టామన్నారు. అనంతరం కలెక్టరేట్లో చేనేతలతో తయారు చేసిన మదనపల్లి సిల్క్ చీరలు అమ్మే స్టాల్‌ని రిబ్బన్ కట్ చేసి కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా చేనేత శాఖ ఏడీ శ్రీదేవి, వివిధ చేనేత కార్మికుల సంఘ నాయకులు, చేనేత సంఘాల వారు, హేమంత్, చేనేత ఐక్యవేదిక పురం రెడ్డెయ్య, నాగరాజ, అంజి, బోడెం చెన్నయ్య, కుర్ర వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణలో ఆటంకాలు తొలగించాలి

- సాధ్యమైనంత త్వరగా అవార్డులు ప్రకటించాలి
- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



జాతీయ రహదారి భూసేకరణపై తహసీల్దార్లకు సూచనలిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

మదనపల్లె టౌన్, ఆగస్టు 7: మదనపల్లె-పీలేరు మధ్య నాలుగు లేన్ల జాతీయ రహదారి (ఎన్‌హెచ్-71) నిర్మాణంలో భాగంగా భూసేకరణకు వస్తున్న ఆటంకాలను తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టరేట్ సమావేశ భవనంలో మదనపల్లె, వాల్మీకిపురం, కలికిరి మండలాలకు చెందిన తహసీల్దార్లు, భూసేకరణ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మొత్తం 25 గ్రామాల పరిధిలో ఇప్పటి వరకు సేకరించిన భూమిలో కొన్నిచోట్ల టైటిళ్లలో పేర్లు మారినట్టు తెలుస్తోందని, దీనిపై విచారించి టైటిళ్లను సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. రైతులకు ఇవ్వాల్సిన అవార్డులను ప్రకటించి, వారికి అందే పరిహారం గురించి అవగాహన సమావేశాలు నిర్వహించాలన్నారు. కోర్టు కేసుల్లో ఉన్న వాటిపై న్యాయ సలహా తీసుకుని ముందుకు సాగాలన్నారు. మదనపల్లె పట్టణం బైపాస్ రోడ్డులోని బీకేపల్లె నుంచి బసినికొండ రోడ్డు టర్నింగ్ వరకు నిర్మించనున్న ఫ్లైఓవర్‌లో భూసేకరణ ఎంతవరకు వచ్చింది, రైతులకు, ఇళ్ల స్థలాలు కోల్పోయే వారికి పరిహారం చెల్లించడంలో ఆలస్యం చేయొద్దన్నారు. ఈ ఫైళ్లన్నీ వారం లోపు నివేదికలు పంపాలన్నారు. ప్రతి వారం భూసేకరణపై సమీక్షలు నిర్వహిస్తానన్నారు. సమావేశంలో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, ఎన్‌హెచ్ పీడీ దామోదర్ మదనపల్లె, వాల్మీకిపురం, కలికిరి, పీలేరు తహసీల్దార్‌లు ఖాజాబీ, ఫిరోజ్‌ఖాన్, సయ్యద్ అహ్మద్, భీమేశ్వరరావు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

- ఒబెరాయ్ హోటల్ నిర్మాణం హిల్స్‌కే తలమానికం
- కలెక్టర్ చామకూరి శ్రీధర్



హార్సిలీహిల్స్‌లో ఒబెరాయ్ హోటల్‌కు కేటాయించిన స్థలం వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

బి.కొత్తకోట, ఆగస్టు 7: హార్సిలీహిల్స్‌ను అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబుతో పాటు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో బుధవారం ఆయన జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌లతో కలిసి పర్యటించారు. దేశంలోనే హోటల్ రంగంలో పేరుగడించిన ఒబెరాయ్ సంస్థకు మూడు నక్షత్రాల హోటల్ నిర్మాణం కోసం హిల్స్‌పై కేటాయించిన 20.48 ఎకరాల స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. స్థల కేటాయింపునకు సంబంధించిన వివరాలను రెవెన్యూ, టౌన్‌షిప్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. హిల్స్‌పై రిజర్వు ఫారెస్టుకు ఆనుకుని వున్న 591, 572, 592 తదితర సర్వే నెంబర్లలో ఒబెరాయ్ సంస్థకు లీజుకు స్థలాన్ని కేటాయించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అదేవిధంగా హిల్స్‌పై సాహస క్రీడల యూనిట్ నిర్మాణం కోసం కేటాయించాలని భావిస్తున్న 3 ఎకరాల స్థలాన్ని కలెక్టర్ ఆదేశాలతో జేసీ, సబ్ కలెక్టర్‌లు పరిశీలించారు. అనంతరం హిల్స్‌పై నిర్మిస్తున్న రెవెన్యూ అతిథిగృహం, గవర్నర్ బంగ్లా, అటవీ శాఖ అతిథి గృహలను కలెక్టర్ పరిశీలించారు. మహావృక్ష పురస్కారం పొందిన 164 ఏళ్ల నాటి యూకలిప్టస్ వృక్షాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విలేఖరులతో మాట్లాడుతూ హార్సిలీహిల్స్‌లో ప్రఖ్యాత ఒబెరాయ్ సంస్థ హోటల్ నిర్మాణానికి ముందుకు రావడం శుభ పరిణామమని అన్నారు. దీంతో రూ.250 కోట్ల పెట్టుబడులు రావడంతో పాటు పర్యాటక, సాంకేతిక రంగాల్లో అనేక మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, క్రీడల శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఈ విషయమై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, వారం రోజుల్లో హిల్స్‌కు రానున్న ఒబెరాయ్ సంస్థ సాంకేతిక బృందానికి హోటల్‌కు కేటాయించిన స్థలాన్ని స్వాధీనం చేస్తామన్నారు. సెప్టెంబరు కల్లా హోటల్ నిర్మాణానికి శంఖుస్థాపన జరుగుతుందని తెలిపారు. హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ పనితీరు, నిర్ణయాలపై విశ్లేషిస్తామని హిల్స్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. మదనపల్లె డివిజన్‌లో టమోటా అధికంగా ఉన్నందున ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పడంతో పాటు, రైళ్ల ద్వారా ఢిల్లీ తదితర ప్రాంతాలకు టమోటాలను ఎగుమతి చేసి రైతులను ఆదుకునే ప్రతిపాదన ఉందని తెలిపారు. రాష్ట్రంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దయిన నేపథ్యంలో జిల్లాలో ఫ్రీహోల్డ్ అయిన 1.81 లక్షల ఎకరాల భూములపై సమగ్ర విచారణ జరిపేందుకు రీవెరిఫికేషన్ పెట్టించామన్నారు. రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో లోతుగా విచారణ చేసి, ఫ్రీహోల్డ్ అర్హతలపై నివేదిక ఇచ్చేందుకు 15 రోజుల గడువునిచ్చామని ఆ నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో బి.కొత్తకోట డిప్యూటీ తహసీల్దార్ మహ్మద్ అన్సారి, సర్వేయర్లు శ్రీవాణి, రఫీ, వీఆర్వో నరేంద్రకుమార్, ఏఎస్ఐ బొజ్జేనాయక్, టూరిజం సిబ్బంది పాల్గొన్నారు.

కోదండరామాలయం మరమ్మతులకు భూమిపూజ



ఒంటిమిట్ట, ఆగస్టు 7: కోదండరామాలయంలో మరమ్మతులు, విమాన గోపురం మరమ్మతులు ఆలయ ప్రాకార మరమ్మతులకు బుధవారం టీటీడీ అర్చకులు, పురావస్తు అధికారులతో కలిసి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. సెప్టెంబరు 8 నుంచి రామాలయంలో పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం మంచిరోజు కావడంతో శ్రావమణమాసం సందర్భంగా పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాకారంలో దెబ్బతిన్న ఫ్లోరింగ్‌ను పరిశీలించి మరమ్మతులకు నిధులు కేటాయించేందుకు అధికారులకు అంగీకరించారు. వీటితో పాటు రామాలయ అభివృద్ధికి అవసరమయ్యే పనులను ఢిల్లీలోని కేంద్ర కార్యాలయానికి పంపి అనుమతులు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పురావస్తుశాఖ సూపరింటెండెంట్ గోపీనాథ్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ దేవేంద్రబోయి, ఇంజనీరింగ్ అధికారి భానుప్రకాష్‌వర్మ, బాలక్రిష్ణారెడ్డి, టీటీడీ సూపరింటెండెంట్ నాగరాజు, టీటీడీ అర్చకులు వీణారాఘవాచార్యులు, మనోజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల అభివృద్ధికి ప్రణాళికలు

- ఎన్‌సీడీసీ ప్రాజక్టు మేనేజర్ నరేంద్ర



రికార్డులు పరిశీలిస్తున్న ఎన్‌సీడీసీ మేనేజర్ నరేంద్ర తదితరులు

నిమ్మనపల్లి, ఆగస్టు 7: రాష్ట్రంలోని సహకార సంఘాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు విజయవాడ (నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఎన్‌సీడీసీ మేనేజర్ నరేంద్ర తెలిపారు. బుధవారం మండలంలోని సింగిల్ విండో కార్యాలయాన్ని తనిఖీ చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్టు కింద అన్నమయ్య జిల్లా 5 మండలాలు ఎంపిక కాగా అందులో నిమ్మనపల్లి ఒకటి అన్నారు. దీంతో రాష్ట్ర సహకార శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సహకారంతో సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మండలంలో నిర్మించిన గోడౌన్‌లకు సంబంధించి వాటిని వాడుకలోకి తీసుకువచ్చి వరి, వేరుశనగకాయలు, తదితర పంటలను కొనుగోలు చేసేందుకు సేందకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రధానమంత్రి స్కీం కింద ఏర్పాటైన జనఔషధి, మీసేవ కేంద్రాలలో సక్రమమైన పద్ధతిలో నిర్వహణ, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలతో పాటు బ్యాంకు ద్వారా బంగారుపై విరివిగా రుణాలు వంటివి ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చేపట్టే 25 పథకాలను నిమ్మనపల్లిలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ ఏజీఎం చంద్రకళ, మేనేజర్ పుష్పావతి, ప్రొసీడింగ్స్ ఇన్‌చార్జి రఘునాధరెడ్డి, సూపర్‌వైజర్ నాయక్, సీఈవో హరినాధరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దొడ్డిదారిన గెలిచిన వారికి మాట్లాడే అర్హత లేదు

- మంత్రి నారా లోకేశ్‌కు క్షమాపణ చెప్పాలి
- ఉత్కంఠగా మండల సర్వసభ్య సమావేశం



రోడ్డుపై నిరసన తెలుపుతున్న కూటమి నేతలు

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 7: ప్రజల ఓట్లతో కాకుండా దొడ్డిదారిన గెలిచిన ప్రజాప్రతినిధులకు సమావేశంలో మాట్లాడే అర్హత లేదని, తమ పదవులకు రాజీనామా చేసి ఎన్నికల్లో గెలిచిన తర్వాతే మాట్లాడాలని కూటమి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పీటీఎం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. ఉదయం 11 గంటలకు జరగాల్సిన సమావేశానికి ఎంపీపీ, ఎంపీటీసీలు, వైసీపీకి చెందిన సర్పంచ్‌లు దొడ్డిదారిలో ఉదయం 8 గంటలకే మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. అందులో ప్రజాప్రతినిధులు కాని సభ్యులు మండల కార్యాలయానికి చేరుకోవడంతో విషయం తెలుసుకున్న కూటమి నేతలు అక్కడికి చేరుకుని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. నారా లోకేశ్ పాదయాత్ర సమయంలో స్థానిక పీటీఎంలో నారా లోకేశ్ చిత్రపటాన్ని చెప్పులతో కొట్టి స్థానిక ప్రజాప్రతినిధులు అవమానపరిచారని, వెంటనే లోకేశ్‌కు క్షమాపణ చెప్పాలని లోకేశ్ యువసేన నాయకుడు సురేష్‌యాదవ్‌తో పాటు ములకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘించి దొడ్డిదారిన ఎంపికైన వారికి సమావేశం నిర్వహించే అర్హత లేదన్నారు. అక్కడికి పెద్దఎత్తున కూటమి నాయకులు చేరుకోవడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో అన్న ఉత్కంఠ నెలకొంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు, 8 మంది సీఐలు, ఆరుగురు ఎస్‌ఐలు, సుమారు 60 మందికి పైగా పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కూటమి నాయకులు రోడ్డుపై బైఠాయించి నారా లోకేశ్‌కు క్షమాపణ చెప్పాలని, లేకుంటే సమావేశాన్ని రద్దు చేయాలని డిమాండు చేయడంతో ఎంపీడీవో బ్రహ్మానందరెడ్డి ఇక్కడి సమాచారాన్ని కలెక్టర్, ఎస్పీలకు ఫోన్ చేసి తెలిపారు. అనంతరం జిల్లా అధికారుల ఆదేశానుసారం సమావేశాన్ని రద్దు చేస్తున్నట్లు నోటీస్ బోర్డులో పెట్టడంతో సభ వాయిదా పడింది. దీంతో కూటమి నాయకులు అక్కడి నుంచి వెనుదిరిగారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గూటం ఈశ్వరప్ప, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీనాథరెడ్డి, పులికల్లు మాజీ సర్పంచ్ కట్టా వెంకట్రమణ నాయుడు, మడుమూరు మాజీ సర్పంచ్ వంకవరస మోహన్, ముదుమూరు టీడీపీ యువనాయకుడు నవీన్, సుధాకర్‌రెడ్డి, బూర్లపల్లె మాజీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, పట్టా చంద్రమోహన్‌రెడ్డి, పోతుపేట సర్పంచ్ కొండా కళావతి, చిన్నపరెడ్డి, పోతుపేట వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, కుమ్మరవారిపల్లె రాజేష్, పాలగిరి రామాంజులు మాజీ ఎంపీటీసీ చిన్నాలతో పాటు అధిక సంఖ్యలలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయం వద్ద మోహరించిన పోలీసులు



అమ్మపాలే... బిడ్డకు అమృతం

- పోత పాలతో పుట్టెడు రోగాలు
- పాలిస్తే అందం పోతుందన్న బెంగలో మోడ్రన్ తల్లులు
- పాలివ్వకపోతే బ్రెస్ట్ క్యాన్సర్ తప్పదంటున్న వైద్యులు

కడప(కలెక్టరేట్), ఆగస్టు 7: పుట్టినప్రతి బిడ్డకు అమ్మపాలే అమృతం. పుట్టిన వెంటనే ఇచ్చే ముర్రుపాలే సకల రోగాలకు రక్ష. కానీ నేటి తరం తల్లుల్లో 40 శాతం మంది బిడ్డలకు పాలివ్వకుండా మోడ్రన్ తల్లులుగా మారుతున్న తీరు వైద్యశాఖను కలవర పెడుతోంది. పాలిస్తే అందం, చందం తరుగుతుందనే అపోహల నడుమ బిడ్డలు తల్లిపాలకు దూరమవుతున్నారు. దీంతో బిడ్డకు పోతపాలు రోగాలు తెచ్చి పెడుతుండగా, పాలివ్వని తల్లులు పేగు బంధం కోల్పోతున్నారనే వాదన వైద్యుల్లో ఉంది. అంతే కాకుండా తల్లి ఆరోగ్యం కుదురుగా ఉండక పోగా.. బ్రెస్ట్ క్యాన్సర్, యుట్రిక్ క్యాన్సర్ల బారిన పడే వారిలో పోతపాల మోడ్రన్ తల్లులే ముందు వరస లో ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాలు తేల్చింది. దేవతలకు సంజీవినిగా చెప్పుకొనే అమృతం ఎలాగో... పుట్టిన బిడ్డకు అమ్మపాలు అమృతం కంటే ఎక్కువే. డబ్ల్యూహెచ్ఓ ఆదేశాల మేరకు.. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా జిల్లాలో వైద్యశాఖ ఆధ్వర్యంలో ఆగస్టు నెలలో వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈనెల 1న కలెక్టర్ లోతేటి శివశంకర్ అమ్మపాలే బిడ్డకు అమృతం అంటూ రిమ్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రచారాన్ని ప్రారంభించడం, వైద్యశాఖ ఐసీడీఎస్ సమన్వయంతో గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేయడం శుభ పరిణామం.

మురిపాల బిడ్డకు.. ముర్రుపాలే మొదటి టీకా

అపుడే పుట్టిన బిడ్డకు తల్లి మొదటగా ఇచ్చే ముర్రుపాలే సకల రోగ నివారిణి. తల్లిపాలతో రోగ నిరోధక శక్తి పెరిగి.. వ్యాధుల బారిన పడరు. అంతేకాకుండా డయేరియా, ఊపిరితిత్తులు, ఇతర వ్యాధుల బారినపడే అవకాశాలు తక్కువే అంటారు. పుట్టిన మొదటి గంటలో తల్లిపాలే బిడ్డకు మొదటి టీకాగా ఉపయోగపడుతుంది. తల్లి పాలకు ప్రత్యామ్నాం లేదనే విషయం చాటి చెప్పేలా.. తల్లీ బిడ్డల ఆరోగ్యం కోసం పాలిచ్చే తల్లులందరికీ మనందరం మద్దతు ప్రకటించాల్సిన ఆవశ్యకత ఎంతై నా ఉంది. ఇకపోతే ముర్రుపాలు పుట్టిన బిడ్డకు జీర్ణం కాదనేది అపోహ మాత్రమే అని చెబుతున్నారు వైద్యులు. లైప్రోజ్ ఎంజైమ్ ద్వారా అరుగుదల సులభమంటారు. డబ్బా, గేద పాలు తాగించడం వల్ల ఊబకాయం (ఒబిసిటీ), షుగర్ వ్యాధులు వచ్చే అవకాశలు ఎక్కువ.

పాలివ్వని తల్లులకే బ్రెస్ట్ కాన్సర్

పుట్టిన బిడ్డకు పాలివ్వని తల్లులకే ఎక్కువగా బ్రెస్ట్ కాన్సర్, గర్భాశయ(యుట్రిన్) క్యాన్సర్‌లు వచ్చే అవకాశలు ఎక్కువంటున్నారు వైద్యులు. ఇప్పటికే ఈ వ్యాధి బారి న పడిన వారి వివరాలను సేకరించి వైద్యశాఖకు తెలిపేందుకు అంగన్వాడీ, ఆశాలు, ఏఎన్ఎంలతో కూడిన బృందం త్వరలో లెక్కలు తీయనున్నారు. తల్లి పాలు బిడ్డకు ఇవ్వడం వల్ల ఆక్టోసిన్ హార్మోను విడుదలతో క్యాన్సర్‌ను కట్టడి చేయవచ్చు.

ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం..

తల్లిపాలు పుట్టిన ప్రతి బిడ్డకు అమృతం లాంటివి, బిడ్డ పెరుగుదలకే కాదు మెదడు చురుకుదనంగా ఉంటుంది. నవ జాత శిశువుకు తల్లి పాలే శ్రేష్టం. గేదేపాలు, డబ్బాపాలతో అనారోగ్య సమస్యలు తప్పవు. చాలా మంది తల్లులు అందచందాలంటూ బిడ్డలకు పాలివ్వకుండా పోతపాలతో సరిపెడుతున్నారు. పాలిస్తే అందం పెరుగుతుంది కానీ తరగదనే విషయాన్ని ప్రతి తల్లి గమనించాలి.

-డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి



కాన్పు అయిన వెంటనే బిడ్డకు పాలివ్వకపోతే శ్వాస, శారీరక, బ్రైన్, భవిష్యత్తులో స్థూలకాయం, సుగర్ వ్యాధు సమస్యలు వచ్చే ప్రమాదాలెక్కువని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తుండడం గమనర్హం

బిడ్డకు 6 నెలల పాటు అమ్మపాలే...

పుట్టిన ప్రతి బిడ్డకు 6 నెలలపాటు అమ్మ పాలు ఇవ్వడం వల్ల బిడ్డకు ఆరోగ్య సమస్యలతో పాటు తల్లికి ఎలాంటి వ్యాధుల సమస్యలు దరి చేరవు. ఇక పోతే కొందరు తల్లుల్లో పాలు పడక పోవడం వల్ల ఆందోళనకు గురవుతుంటారు. అలాంటివారు పదేపదే బిడ్డకు పాలిచ్చేందుకు వెనుకాడకూడదని, క్రమం తప్పకుండా తాగించడం, పోషక విలువలతో కూడిన ఆహారం తినడం వల్ల ఆటోమేటిక్‌గా పాల ఉత్పత్తి పెరుగుతుందంటారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి : డీఈవో



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో అనురాధ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 7: బడి ఈడు పిల్లలు వంద శాతం బడిలోనే ఉండాలని జిల్లా విదాశాఖాధికారి అనురాధ పేర్కొన్నారు. బుధవారం కడప నగరం జయనగర్ కాలనీ బాలికోన్నత పాఠశాలలో ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాను డ్రాప్ అవుట్స్ రహిత జిల్లాగా మార్చాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా టీచర్ ఇన్ ఫర్మేషన్ సిస్టంలో తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. యూడైస్‌లో లోటుపాట్లను సవరించి ఖచ్చితమైన వివరాలు తయారు చేయాలన్నారు. సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు దశరథరామిరెడ్డి, ఇలియాస్‌ఖాన్, లక్ష్మీనరసింహ రాజు, కేశవరెడ్డి, విశ్వనాథరెడ్డి, రామాంజనేయరెడ్డి, రమణమూర్తి, బ్రహ్మానందరెడ్డి, జాలాపతి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో-2 జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చిట్టిబాబు, సునీల్‌కుమార్



చిట్టిబాబు, సునీల్‌కుమార్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 7: ఎంఈవో-2 జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మైలవరం మండలం ఎంఈవో-2 బత్తిన చిట్టిబాబు, బి.కోడూరు మండలం ఎంఈవో-2 ఎం.సునీల్‌కుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బుధవారం కడప నగరం జయనగర్ కాలనీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఎంఈవో-2 సంఘం సమావేశం నిర్వహించి.. నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షుడిగా సి.రఘురాములు, ఉపాధ్యక్షులుగా బి.ప్రమీల, కార్యదర్శులుగా జీవీ సుభాషిణి, నిర్మల, కోశాధికారిగా సత్యనారాయణ, స్టేట్ కౌన్సిలర్లుగా వంశీక్రిష్ణ, గంగాధర్‌నాయక్‌లను ఎంపిక చేశారు.

ప్రభుత్వాసుపత్రిలో అరుదైన ఆపరేషన్



రోగి కడుపులో నుంచి తీసిన కణితులు

రాయచోటిటౌన్, ఆగస్టు 7: స్థానిక ప్రాంతీయ వైద్యశాల వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి రికార్డు సృష్టించారు. ప్రముఖ వైద్య నిపుణులు సీనియర్ సివిల్ సర్జన్ డీ.లక్ష్మిప్రసాద్ ఆధ్వర్యంలోని వైద్య బృందం కడుపునొప్పితో వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన ఒక నిరుపేద రోగిని పరీక్షించి శస్త్రచికిత్స చేయకపోతే ప్రాణాలకే ప్రమాదమని నిర్ధారణకు వచ్చారు. శస్త్రచికిత్స కోసం బెంగుళూరు, మద్రాసు, హైదరాబాద్ లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్లడానికి రోగికి ఆర్థిక స్తోమత లేదని గుర్తించిన వైద్యులు తమవద్ద అందుబాటులో గల వైద్య పరికరాలతోనే ఆపరేషన్ చేసి కడుపులోని 12 కణితులను తొలగించారు. తన అనుభవ నైపుణ్యంతో అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన డాక్టర్ లక్ష్మిప్రసాద్‌ను తోటి వైద్యులతో పాటు ఆసుపత్రి సిబ్బంది రోగి కుటుంబ సభ్యులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి

రైల్వేకోడూరు(రూరల్), ఆగస్టు 7: మండలంలోని మైసూరివారిపల్లె పంచాయతీ కృష్ణ ఐటీఐ కాలేజీ దగ్గర ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మాధవరంపోడుకు చెందిన కిరణ్‌కుమార్ రెడ్డి(23) మృతి చెందాడు. రైల్వేకోడూరు సీఐ టి.బాబు వివరాల మేరకు... మాధవరంపోడు దిగువ పంచాయతీకి చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి ఉపాధి కోసం కువైత్‌కు వెళ్లి రెండు రోజుల క్రితమే ఇంటికి వచ్చాడు. బుధవారం పని నిమిత్తం కోడూరుకు వచ్చి తిరిగి తన బైకులో మాధవరంపోడు వెళుతుండగా.. కడప వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శవ పరీక్ష నిమిత్తం మృతదేహన్ని రైల్వేకో డూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి.. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కిరణ్‌కుమార్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలు ముకున్నాయి.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



మృతి చెందిన చిన్నక్క

మైదుకూరు రూరల్ ఆగస్టు 7: మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని లింగాలదిన్నె గ్రామంలో ధనికెల చిన్నక్క (39) బుధవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. గ్రామస్థుల వివరాల మేరకు.. మంగళ వారం రాత్రి వర్షం కురవడంతో చిన్నక్క తమ పొలం చూసేందుకు వెళ్లింది. ఆసమయంలో నీళ్ల తాగేందుకు బోరు వద్దకు వెళ్లగా.. కరెంటు షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందింది. ఈమెకు భర్తతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొడ్డలితో దాడి - వ్యక్తికి గాయాలు



జమ్మలమడుగు, ఆగస్టు 7: జమ్మలమడుగు పట్టణంలోని దిగువపట్నం కాలనీ వద్ద బుధవారం ఉదయం టీడీపీ కార్యకర్త వెంకటనారాయణపై వైసీపీ కార్యకర్త నానుబాల రాయల్ కిరణ్ గొడ్డలితో దాడి చేశాడు. ఈ ఘటనలో వెంకటనారాయణ తలకు తీవ్ర గాయమైంది. జమ్మలమడుగులో పెన్నా పరిసర ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయాన్నే కోవెలకుంట్ల రోడ్డులో అర్బన్ పోలీసులు రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని స్టేషకు తరలించారు. ఈ విషయమై పోలీసులకు నీవు సమాచారం ఇచ్చావంటే. నువ్వే ఇచ్చావని వెంకటనారాయణ, రాయల్‌కిరణ్‌లు పోలీసు స్టేషన్ ఎదుటే గొడవకు దిగారు. అక్కడి నుంచి వెంకటనారాయణ ఇంటికి వెళుతుండగా రాయల్‌కిరణ్ గొడ్డలితో దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడిన వ్యక్తిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరుకు తరలించారు. జరిగిన ఘటనకు సంబందించి అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'వైసీపీ నిర్లక్ష్యం చేనేతలకు శాపం'

సింహాద్రిపురం, ఆగస్టు 7: వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా చేనేతలు అనేక రకాల లబ్ధిని కోల్పోయారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం సింహాద్రిపురం చౌడేశ్వరి దేవాలయంలో చేనేతలను సన్మానించారు. ఈ సందర్భంగా చేనేతల పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లగా... సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్క రించేందుకు కృషి చేస్తానని తెలిపారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మినారాయణరెడ్డి, ఎస్సీ మోర్చా నల్లప్ప, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బాలల హక్కుల పరి రక్షణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ సభ్యుడు జంగం రాజేంద్ర ప్రసాద్

కడప(కలెక్టరేట్), ఆగస్టు 7: బాలల హక్కులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సంగం రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్ వీసీహాల్లో స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్‌రైట్స్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో బాలల హక్కులు, వారి కోసం ఉద్దేశించిన చట్టాల అమలు తీరుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ విధులను, ఆవశ్యకతను తెలిపారు. వెల్ఫేర్ అధికారులు, ప్రిన్సిపాల్స్ పిల్లల పట్ల సున్నితత్వంతో మెలగాలన్నారు పిల్లల సంరక్షకులే కాకుండా ఇతరులు పిల్లలను చూడడానికి వస్తే వారికి అనుమతిని నిరాకరించాలన్నారు. ఎక్కడైనా సమస్యలు గుర్తించిన వెంటనే బాలల పరిరక్షణ విభాగానికి తెలపాలన్నారు. రాజ్యాంగం ద్వారా బాలలకు ప్రత్యేకంగా హక్కులు కల్పించారని, సమాజ మార్పులకు అనుగుణంగా ప్రభుత్వాలు సైతం ఎప్పటికప్పుడు కొత్తగా బాలల కోసం చట్టాలను రూపొందిస్తూ అమలు చేస్తున్నాయన్నారు. సంరక్షణ కేంద్రాలు సొంత బిడ్డల్లాగా చూసుకోవాలన్నారు. ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మీ మాట్లాడుతూ పిల్లల సమస్యల కోసం 198, మహిళల సమస్యల కోసం 181 టోల్‌ఫ్రీ నెంబర్లు అందుబాటులో ఉంచామని, ఆ నెంబర్లకు ఫోన్ చేస్తే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. బాలల, మహిళల హక్కుల చట్టాలపై మండల, డివిజన్‌స్థాయి అధికారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. బాలల సంక్షేమ సమితి ఛైర్మన్ సాంబ శివరావు మాట్లాడుతూ బాలలరక్షణ, సంరక్షణ కోసం పని చేస్తున్నపుడు సానుభూతితో పని చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి సుభాష్, డీఈఓ అనురాధ, డీడీ సరస్వతి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

విద్యుత్ అంతరాయాలను పూర్తిగా నివారించాలి : ఎస్ఈ



సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ రమణ

బద్వేలు, ఆగస్టు 7: విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. విద్యుత్ స్తంభాలను, తెగిపడిన విద్యుత్ వైర్లను తాకకుండా విద్యుత్ సిబ్బందితో మరమ్మతులు చేయించుకోవాలని ఎస్ఈ ఎస్.రమణ సూచించారు. బద్వేలు, గోపవరం, అట్లూరు, బ్రహ్మంగారిమఠం మండలాల అధికారులు, సిబ్బందితో బద్వేలులోని విద్యుత్ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ లూజులైన్‌లు, తక్కువ ఎత్తులో ఉన్న లైన్లు గుర్తించి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎత్తైన లోడుతో వెళ్లే వాహనదారులు పైనున్న లైన్లను గమనించి జాగ్రత్తగా వెళ్లాలని, విద్యుత్ పనులు చేసేటపుడు సిబ్బంది విధిగా భద్రతా నియమాలు పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. ఫ్యూజులు వేయడం, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను మార్చడం వంటి పనుల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయాలు అధికంగా ఉంటే సమస్యను గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. లోవోల్టేజీ సమస్య తలెత్తకుండా అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. వినియోగదారుల సమస్యలు పరిష్కరించి సంస్థపై వారి సంతృప్తికర స్థాయిని పెంచేలా ప్రతి ఉద్యోగి కృషి చేయాలన్నారు. అంతకు ముందు ఆయన పలు సబ్‌స్టేషన్లను పరిశీలించారు. సమావేశంలో మైదుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భరణి కృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కుళ్లాయప్ప, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు విజయ్‌కుమార్, రమణ, రవి, శంకర్, చిన్నయ్య, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈనెలాఖరు లోపు ఇ-క్రాప్ పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త సాయిమహేశ్వరి

పులివెందుల రూరల్, ఆగస్టు 7: ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు ఇ-క్రాప్ నమోదు ప్రక్రియ ఈనెలాఖరులోగా పూర్తిచేయాలని పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి అధికారు లను ఆదేశించారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులోని పాత ఏడీఏ కార్యాలయంలో అన్ని మండలాల ఏఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు, పంటల సాగు లో పాటించాల్సిన పద్ధతుల గురించి వివరించారు. ఏడీఏ మాట్లాడుతూ ప్రతి రోజు పొలాలు పరిశీలించి సమస్యలు తెలు సుకొని పరిష్కరించాలన్నారు. డీఏఓ ఆఫీస్ ఏడీఏ డి.రమణారెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు సాయి మహేశ్వరి, ఏరువాక కేంద్రం కోఆర్డి నేటర్ అంకయ్య మాట్లాడారు. సాగులో ఉన్న వివిధ రకాల పంటలలో ఉన్న సమ స్యలు, పరిష్కారాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో వివిధ పంటలలో పాటించాల్సిన పద్ధతులను, భూసార పరీక్ష ఆధారంగా పోషకాలు ఎలా ఇవ్వాలనే అంశాలను తెలియజేశారు. ప్రస్తుత వాతా వరణ పరిస్థితులలో పంట యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. పలు పంటలకు సోకే తెగుళ్ల, ఆశించే దోమలు, పురుగుల నివారణకు వాడాల్సిన మందులు, పిచికారీ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఏఓలు సునీల్‌కుమార్‌రెడ్డి, నాగభూషణం రెడ్డి, చెన్నారెడ్డి, నాగలక్ష్మి, రమేష్, రాజేంద్ర ప్రసాద్, నవంత్‌బాబు, డివిజన్‌స్థాయి రైతుసేవా కేంద్ర ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

చర్చి కోసం పది ఎకరాల గుట్ట మాయం

- వైఎస్ కుటుంబ సభ్యుని అండదండలతోనే కబ్జా
- నకిలీ పత్రాలతో అధికారులకు టోకరా
- దర్జాగా షెడ్ల నిర్మాణాలు
- పనులు ఆపేయాలంటూ కలెక్టర్ ఆదేశాలు



అక్రమంగా జరుగుతున్న చర్చి నిర్మాణ పనులు

పులివెందుల టౌన్, ఆగస్టు 7: చర్చి నిర్మాణం పేరుతో 10 ఎకరాల గుట్టను మాయం చేసిన సంఘటన పులివెందుల మున్సిపల్ పరిధిలో చోటు చేసుకుంది. వైఎస్ కుటుంబానికి చెందిన ఒక వ్యక్తి అండదండలతోనే ఈతతంగం జరిగినట్లు సమాచారం. పులివెందుల మున్సిపల్ పరిధిలోని కదిరి రోడ్డు డంప్‌యార్డు వద్ద ప్రధాన రహదారికి సమీపంలో సర్వే నెంబర్ 313/1లో దాదాపు వంద ఎకరాలు ఉన్న గుట్టలో పది ఎకరాలను యంత్రాల సహాయంతో చదును చేసి షెడ్ల నిర్మాణాలను చేపడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి ఇక్కడ చర్చి నిర్మాణం, భోజన సదుపాయాల కోసం షెడ్ల నిర్మాణ పనులను చేపట్టారు. ఇందుకు స్థానిక అధికారులు కూడా కబ్జాదారులకు అండగా నిలిచారు. ఈ ఆక్రమణల గురించి ప్రస్తుత కలెక్టర్‌కు ఫిర్యాదులు వెల్లడంతో ఆయన స్పందించి.. స్థానిక రెవిన్యూ డివిజన్ అధికారితో పాటు తహసీల్దార్‌కు వెంటనే అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో సంబంధిత అధికారులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్న ప్రదేశానికి వెళ్లి నిర్మాణాలను ఆపివేశారు. ప్రతిరోజు నిర్మాణ పనులు చేపట్టకుండా నాలుగు రోజుల నుంచి వీఆర్‌ఏలను షిఫ్ట్‌ల వారీగా కాపాల కోసం డ్యూటీ వేశారు.

చర్చి నిర్మాణ పనులు నిలిపివేశాం - ఆర్డీఓ

చర్చి అక్రమ నిర్మాణాల నిలిపివేత గురించి ఆర్డీఓను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిలిపివేశామని సమాధానం ఇచ్చారు. ఈ నిర్మాణాల గురించి గతంలోనే ఆరా తీయగా.. మాకు పత్రాలు ఉన్నాయని చెప్పారని, కానీ కలెక్టర్ ఆదేశాలతో నిర్మాణ పనులు చేపడుతున్న వారు అందించిన పత్రాలను పరిశీలించగా నకిలీవని తేలాయని, దీంతో వారు ప్రభుత్వ ధరల ప్రకారం లీజుకు తీసుకుంటామని అడుగుతున్నారన్నారు. నకిలీపత్రాల గురించి ఉన్నతా. దికారులకు సమాచారం అందించామని.. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నం



ఏటీఎంను పరిశీలిస్తున్న డీఎస్పీ, పోలీసులు

ఖాజీపేట, ఆగస్టు 7: ఖాజీపేటలో బుధవారం తెల్లవారుజామున దొంగలు పడ్డారు. ఏకంగా పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో దొంగతనానికి యత్నించారు. ఏటీఎంలోకి వెళ్లగానే సీసీ కెమెరాలకు స్టిక్కర్లు అతికించి.. ఏటీఎం ముందుబాగం డోరు తొలగించేందుకు ప్రయత్నం చేయగా సైరన్ మోగడంతో పోలీసులు ఉలిక్కిపడ్డారు. అంతలోపు ఎదురుగా ఉన్న ఇంటి యజమాని బయటకు రావడంతో దొంగ పరారీ అయ్యాడు. ఈ లోపు రాత్రివేళల్లో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఈ విషయం ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ కిశోర్‌కుమార్‌రెడ్డికి సమాచారం ఇవ్వగా బ్యాంకు సిబ్బందిని అక్కడకు పంపి పరిశీలించి డబ్బులు పోలేదని చెప్పడంతో ఇటు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటన విషయం తెలుసుకున్న మైదుకూరు డీఎస్పీ వెంకటేశ్వర్లు ఇన్‌చార్జి ఎస్ఐ మద్దిలేటి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

● సబ్ కలెక్టర్ నిధియాదేవి

రైల్వేకోడూరు(రూరల్), ఆగస్టు 7: ప్రజల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రాజంపేట సబ్ కలెక్టర్ నిధియాదేవి అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డు గదిని పరిశీలించారు. ప్రతి రికార్డులను ఒక క్రమంగా ఆర్డర్ ప్రకారం భద్రపరచాలని, ఎక్కడపడితే అక్కడ గందరగోళంగా ఉంచరాదని సిబ్బందికి సూచించారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రతి సోమవారం ప్రజా పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని తెలియజేశారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



మౌలిక సదుపాయాలపై ఆరా తీస్తున్న సబ్ కలెక్టర్ నిధియాదేవి

గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ పరిధిలో వున్న గిరిజన మినీ గురుకుల పాఠశాలను బుధవారం రాజంపేట సబ్‌కలెక్టర్ నిధియాదేవి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల మౌలిక సదుపాయాలపై సిబ్బందితో ఆరా తీశారు. విద్యార్థుల చదువు, ఉత్తీర్ణత శాతం, మరుగుదొడ్ల పరిశుభ్రత, నీటి కుళాయిలు, వంటశాల, విద్యార్థుల క్లాస్ రూములు, హాస్టల్ రూములను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలకు సరఫరా చేసే బియ్యం తదితర నిత్యావసర సరుకులను పరిశీలించారు. ముఖ్యంగా జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా ఉండరాదని అనారోగ్య సమస్యలతో ఉన్న విద్యార్థులకు తక్షణమే మెరుగైన వైద్యం చేయించాలని హెచ్చరించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలని సిబ్బందికి తెలిపారు.

రాజంపేట: సమాజ శ్రేయస్సు కోసం మానవతా సేవాసంస్థ చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని మన్నూరులో నూతనంగా నిర్మించిన షెడ్డును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రాజంపేటలో గత కొంతకాలంగా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ కార్యదర్శి నంద కిషోర్, సంస్థ జాతీయ నియంత్రణ కమిటీ డైరెక్టర్ రామాంజనేయరెడ్డి, గోపి, కోశాధికారి రామచంద్రయ్యనాయుడు, రాముడు, వెంకటరమణ, రమణారెడ్డి, అబ్దుల్లా, చెంగయ్య, నాగేంద్రనాయక్ పాల్గొన్నారు.

వీరబల్లి తహసీల్దార్‌గా శ్రావణి



వీరబల్లి, ఆగస్టు 7: వీరబల్లి తహసీల్దార్‌గా శ్రావణి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ కోఆర్డినేటర్ సెక్షన్ ఇన్‌చార్జిగా ఉండి, ఇటీవల జరిగిన ఎన్నికల్లో అనంతపురం జిల్లా గాండ్లపెంట తహసీల్దారుగా పనిచేశారు. ప్రస్తుతం వీరబల్లిలో తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. కాగా ఇక్కడ పనిచేసిన శ్రీనివాసులు నంద్యాలకు బదిలీ అయ్యారు.

సుండుపల్లెకు దైవాదీనం..

సుండుపల్లె, ఆగస్టు 7: సుండుపల్లె తహసీల్దార్‌గా దైవాదీనం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో సుండుపల్లెలో పనిచేసిన తహసీల్దార్ జరీనాబేగం బదిలీ కావడంతో జిల్లా అధికారులు ఆయనను సుండుపల్లె తహసీల్దార్‌గా నియమించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఆయన తెలియజేశారు.

గాలివీడుకు భాగ్యలత..



గాలివీడు, ఆగస్టు 7: మండల నూతన తహసీల్దార్‌గా జే.భాగ్యలత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కలికిరి మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఆమె ఎన్నికల అనంతరం బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌కు పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధుల్లో అలసత్వం లేకుండా పనిచేస్తామని స్పష్టం చేశారు. రెవెన్యూ పరంగా ఎలాంటి సమస్యలున్నా సిబ్బందితో కలిసి సమన్వయంతో ప్రజా సమస్యలు, రైతుల భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

చిన్నమండెంకు నరసింహులు..



చిన్నమండెం, ఆగస్టు 7: మండల తహసీల్దార్‌గా బి.నరసింహులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో 2019-2021 వరకు సంబేపల్లె తహసీల్దార్‌గా, కేవీపల్లి, తిరుపతిలో పనిచేశారు. కాగా తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో ఆయన సమీక్షా నిర్వహించి ఫ్రీ హోల్డ్ భూముల గురించి సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు. అలాగే 22ఏ భూములు, డాటర్ ల్యాండ్ భూముల గురించి సిబ్బందికి సూచించారు.

ఉచిత వైద్య పరీక్షలు

ఓబులవారిపల్లె, ఆగస్టు 7: మంగంపేట ఏపీఎండీసీ సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు సీపీవో గోపినాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గనుల్లో పనిచేసే కార్మికులకు ఉచిత వైద్య సేవలు అందించడం శుభపరిణామమని తెలిపారు. ఏపీఎండీసీ అనుబంధ భవనాల ప్రాంగణంలో వైద్య బృందం చే సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్య బృందం తెలిపారు. హార్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ అరవింద్, శ్వాసకోశ వ్యాధుల నిపుణులు డాక్టర్ ప్రవీణ్ రాజ్, గైనకాలజిస్ట్ డాక్టర్ ధన్యలు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం

రాయచోటిటౌన్, ఆగస్టు 7: కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో మూడు రోజుల పాటు విశాఖపట్నంలో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు కోరారు. బుధవారం వారు రాయచోటి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖపట్నంలో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలలో కార్మిక వర్గ సమస్యలపై చర్చించి సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కేశవరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మురళి, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాలసుబ్రమణ్యంతో టీడీపీ నేతల చర్చలు



రాజంపేటటౌన్, ఆగస్టు 7: రాజంపేట నియోజకవర్గంలో పలు సమస్యలను టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యంకు స్థానిక నాయకులు వివరించారు. ప్రధానంగా నీటి సమస్య, రోడ్ల సమస్య తదితర అంశాలపై ఆయనకు వివరించారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను బాలసుబ్రమణ్యం కోరారు. రాజంపేట తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.మహబూబ్‌చంద్ బాలసుబ్రమణ్యంతో భేటీ అయ్యారు. బాలసుబ్రమణ్యంను కలిసిన వారిలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ ఎద్దల విజయసాగర్, రాజంపేట పట్టణ మాజీ అధ్యక్షుడు సంజీవరావు, టీడీపీ నేతలు ఉన్నారు.

చేనేత కార్మికులను అన్నివిధాల ఆదుకుంటాం

● రాష్ట్ర మైనార్టీ మోర్చ ఉపాధ్యక్షుడు షబ్బీర్‌అహ్మద్

పుల్లంపేట, ఆగస్టు 7: ప్రధాని మోదీ చేనేత కార్మికులను సంక్షేమ పథకాల ద్వారా ఆదుకుంటారని రాష్ట్ర మైనార్టీ మోర్చ ఉపాధ్యక్షుడు షబ్బీర్ మహ్మద్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని పుత్తనవారిపల్లె గ్రామంలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ ఆదేశానుసారం మండల ఇన్‌చార్జి రామకృష్ణయ్య ఆధ్వర్యంలో మగ్గాలను పరిశీలించి కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులను సన్మానించి మహిళా కార్మికులకు చీరలతో సన్మానించారు.

కళాశాలలో మొక్కలు నాటిన విద్యార్థులు

రాజంపేట, ఆగస్టు 7: అన్నమాచార్య కళాశాలలో బుధవారం ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు చెట్లు నాటారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎంవీ నారాయణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రమేష్‌కుమార్‌రెడ్డి, ఎన్‌సీసీ అధికారి ఎన్.దీప్తి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగముని, సైపుల్లా తదితరులు చెట్లు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చెట్లను నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పిలుపునిచ్చారు.

ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పనకు వినతి



మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

రాజంపేట, ఆగస్టు 7: రాజంపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు కోరారు. ఈ మేరకు బుధవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 100 పడకల ఆసుపత్రిగా చేసినప్పటికీ గతంలో ఉన్న 50 పడకల ఆసుపత్రికి ఉండాల్సిన మౌలిక వసతులు మాత్రమే దర్శనం ఇస్తున్నాయని తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే వసతులు కల్పిస్తానని, రాజంపేట ఆసుపత్రిని పరిశీలిస్తానని హామీ ఇచ్చారు.

ఒంటిమిట్ట సీఐగా మోహన్‌కుమార్



సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న మోహన్‌కుమార్

ఒంటిమిట్ట, ఆగస్టు 7: ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మోహన్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మదనపల్లె వీఆర్ నుంచి బదిలీ అయ్యారు. ముందుగా కోదండరాముని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి బాధ్యతలను అప్పగించారు. సర్కిల్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా ఇక్కడ సీఐగా పనిచేస్తున్న పురుషోత్తంరాజు కడప వీఆర్‌కు బదిలీ అయ్యారు.

సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడ బాబు ?

● వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేశ్‌కుమార్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 7: 'రాష్ట్ర ప్రజలకు ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడ బాబూ' అంటూ వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేశ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. రాయచోటి పట్టణం బోస్‌నగర్‌లోని తన కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ కల్లబొల్లి మాటలతో ప్రజలను మభ్యపెట్టి, పథకాలపై సుదీర్ఘంగా సమాలోచన చేస్తున్నట్లు చెబుతూ కాలయాపన చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు తీర్చండి

రాజంపేటటౌన్, ఆగస్టు 7: రాజంపేట మున్సిపాల్టీలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న 15 మందికి నాలుగు నెలల నుంచి జీతాలు ఇవ్వక తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సి.రవికుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులందరూ పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారని, కనీసం వారికి ఇంటికి అద్దె చెల్లించే స్తోమత లేక దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణ, డి.లక్ష్మీదేవి, కె.ప్రసాద్, ఎం.వెంకటరమణ, ఎం.ఎల్లయ్య, పి.నరసింహులు, పి.కోనయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు.. బిడ్డకు పునాది : సీడీపీవో

చిట్వేలి, ఆగస్టు 7: తల్లిపాలు బిడ్డకు పునాది అని, పునాది బాగున్నప్పుడే భావి భారతాన్ని పటిష్టంగా నిర్మించగలమని సీడీపీవో రాజేశ్వరి అన్నారు. బుధవారం ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయం నుంచి పాతబస్టాండ్ వరకు ర్యాలీ, నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-1 సూపర్‌వైజర్లు వసుంధరమ్మ, విజయకుమారి, విశాలాక్షి, సురేఖరాణి తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ జెండా ఆవిష్కరణ

సంబేపల్లె, ఆగస్టు 7: మండలంలోని మండల పరిషత్ కార్యాలయం ముందు భాగంలో బుధవారం ఎంఆర్‌పీఎస్ నాయకులు ఎంఆర్‌పీఎస్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ, జిల్లా ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు రవి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ పోరాటంలో మందకృష్ణమాదిగ పోరాట కృషిని అభినందించారు. అన్ని వర్గాల వారికి న్యాయం జరిగిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకులు రామచంద్ర, ఆంజనేయులు, రాంప్రసాద్ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలకు ఓపెన్ ఇంటర్ మంజూరు

చిట్వేలి, ఆగస్టు 7: చిట్వేలి శ్రీ సాయి జూనియర్ కళాశాలలో దూర విద్యా విధానం(ఓపెన్ ఇంటర్) మంజూరైనట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి బుధవారం తెలిపారు. ఈ మేరకు ఎంఈఓలు కోదండనాయుడు, ఈశ్వరయ్యలు, స్టేట్‌కోఆర్డినేటర్ అబ్దుల్లా, జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరాజులతో కలిసి ఓపెన్ ఇంటర్‌కు సంబంధించిన పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచే కోర్సులు మంజూరయ్యాయని, ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీలో అడ్మిషన్లు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక

రాయచోటిటౌన్, ఆగస్టు 7: బీసీ సంక్షేమ సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక బుధవారం రాయచోటి పట్టణంలో జరిగింది. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఇమామ్‌తుల్లా, కోశాధికారిగా సుధాకర్, మహిళా అధ్యక్షురాలుగా రమణమ్మ, యువజన సంఘం కార్యదర్శిగా వెంకటేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రేపటి నుంచి రాజంపేట - పీలేరు మధ్య బస్సు

రాజంపేట, ఆగస్టు 7: రాజంపేట-పీలేరు పట్టణాల మధ్య వయా సానిపాయ మీదుగా శుక్రవారం నుంచి బస్సులు నడపడానికి ఆర్టీసీ అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు జనసేనపార్టీ పార్లమెంట్ నాయకుడు రామా శ్రీనివాసులు తెలిపారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు రాజంపేట డిపో మేనేజర్ రమణయ్య, పీలేరు డిపో మేనేజర్ బండ్లకుమార్ ఈ రెండు పట్టణాల మధ్య బస్సులు నడిపేందుకు అంగీకరించారన్నారు. 9న శుక్రవారం ఉదయం 5.30 గంటలకు పీలేరు నుంచి బస్సు రాజంపేటకు బయలుదేరుతుందన్నారు. 8.30 గంటలకు రాజంపేటకు చేరుకుని 9 గంటలకు రాజంపేట నుంచి తిరిగి పీలేరుకు వెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్‌సెల్ అధ్యక్షుడు కరుణాకర్ రాజు, ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, గోపాల్, టీడీపీ లీగల్‌సెల్ పార్లమెంట్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, మహిళా పార్లమెంట్ ఉపాధ్యక్షురాలు వాణి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

వీరబల్లి, ఆగస్టు 7: మండల పరిధిలోని వీరబల్లి పంచాయతీ పుల్లంగూర గండి సమీపంలోని మామిడి తోటలో జూదమాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.13,650 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండుకు పంపనున్నట్లు ఆయన తెలిపారు.

చేనేత వస్త్రాలను ప్రోత్సహిద్దాం

రైల్వేకోడూరు(రూరల్), ఆగస్టు 7: చేనేత వస్త్రాలను ప్రోత్సహించడం మనందరి బాధ్యత అని కోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.భాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం కళాశాలలో ఐక్యూఏసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత రంగంలో ఎక్కువగా ఉపాధి అవకాశాలు వున్నాయని, అందులో ముఖ్యంగా మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. చేనేత కార్మికులు ఉపాధి లేక ఎందరో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వారి కుటుంబాలలో ఆనందం కోసం చేనేత వస్త్రాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రమేష్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ జి.దయానందం ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.సుబ్రహ్మణ్యం రాజు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంటపై సమన్వయ సమావేశం

సిద్దవటం, ఆగస్టు 7: మండల కేంద్రమైన సిద్దవటం తహసీల్దారు కార్యాలయంలో బుధవారం ఈ-పంట జాయింట్ అజమాయిస్‌పై రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తహసీల్దారు మురాషావలి, మండల వ్యవసాయధికారి రమేష్‌రెడ్డి, ఉద్యాన అధికారి, సహాయ గణన అధికారి, గ్రామ రెవెన్యూ అధికారులు, బద్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ-పంట నమోదు డిజిటల్ క్రాప్ బుకింగ్ రెవెన్యూ, వ్యవసాయాధికారులు, సమన్వయంతో సూక్ష్మ ప్రణాళికతో సకాలంలో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కార్మికుల వేతనాలు చెల్లించాలి

● సీఐటీయూ డిమాండ్

రైల్వేకోడూరు(రూరల్), ఆగస్టు 7: ఉపాధి హామీ కూలీలకు మూడు నెలలుగా, ఫీల్డ్ అసిస్టెంట్లకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం దారుణమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పందికాళ్ల మణి డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేలు, ఉపాధి హామీ కూలీలకు రోజు కూలి రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు మానుకోవాలని హెచ్చరించారు. నూతన ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు అవుతున్నా సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కూలీలకు న్యాయం చేయాలి

● లారీ ఓనర్స్ అసోసియేషన్

ఓబులవారిపల్లె, ఆగస్టు 7: ఏపీఎండీసీ సంస్థ ముగ్గురాయి అమ్మకాలు నిలిపివేతతో వాహనాలకు అనుబంధంగా ఉపాధి పొందుతూ ఉన్న కార్మికులకు న్యాయం చేయాలని ఇన్‌చార్జి సీపీవో గోపీనాథ్‌కు లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు మంగంపేట లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గునిపాటి చెన్నకేశవులు ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు అనుమలగుండం చంద్రమోహన్, కల్ల చలపతి, గునిపాటి రాయుడు, గునిపాటి కిరణ్, గునిపాటి వేణుగోపాల్‌లు ఏపీఎండీసీ పరిపాలన భవనంలో ఇన్‌ఛార్జీ సీపీవోను కలిసి సమస్యలు వివరించారు. లారీ డ్రైవర్లు, సహాయకులు, మిషన్ ఆపరేటర్లు, వారి సహాయకులు, కూలీలు ఉపాధి పొందేవారని, ఏపీఎండీసీ డిస్పాచ్ నిలిపివేసినప్పటి నుంచి పూట గడవక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో లారీ ఓనర్స్ నాగరాజ, శివయ్య, శ్రీనివాసులు, చంద్ర తదితర కార్మికులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోండి



చేనేతశాఖ ఏడీని సన్మానిస్తున్న కార్మికులు

గాలివీడు, ఆగస్టు 7: చేనేత కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, వారిని ఆదుకోవాలని చేనేత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుర్ర వెంకట్రమణ పేర్కొన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మండలంలోని చేనేత కార్మికులు జిల్లా చేనేత శాఖ ఏడీ శ్రీదేవిని కలిసి విజ్ఞప్తి చేశారు. దాదాపు 300 మంది చేనేత కార్మికులు హాజరై చేనేత కార్మికుల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో చేనేత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రమణ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రామచంద్ర, జాతీయ చేనేత ఐక్యవేదిక యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కల్యాణ్ చక్రవర్తి, ప్రభాకర్, రమణయ్య, చిన్నయ్య, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

సమస్యల పట్ల అంకితభావంతో పనిచేయాలి

● సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, ఆగస్టు 7: విద్యార్థి సంఘాలు విద్యార్థుల సమస్యల పట్ల అంకితభావంతో పనిచేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల టీడీపీ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ 89వ వార్షికోత్సవాల సందర్భంగా నిర్వహించే జిల్లా స్థాయి క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమంగా క్రీడలు ఆడటం వలన శారీరక ఉల్లాసం, మానసిక ప్రశాంతత కలుగుతాయన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, టీఎన్ఎస్ఎఫ్ రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు శివప్రసాద్, ఏఐఎస్ఎఫ్ రాయచోటి ఏరియా నాయకులు శ్రీనివాసులు, మురళి, వేణుగోపాల్, సంపత్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడం కూల్చివేత



అక్రమ కట్టడాలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సిద్దవటం, ఆగస్టు 7: బొగ్గుడివారిపల్లె పంచాయతీ పెద్దపల్లి రెవెన్యూ నిర్మల్‌గిరి కాలనీ సమీపంలో సర్వే నంబరులో 870/3 కొంతమంది అక్రమార్కులు ప్రభుత్వ భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా ఏకంగా కాంపౌండ్ ఏర్పాటు చేసుకుని ఇంటి నిర్మాణం పనులను చేపట్టారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రెవెన్యూ అధికారులు అక్రమ కట్టడాలు జరిగిన ప్రాంతానికి వెళ్లి ఆరా తీశారు. కాగా ఈ నిర్మాణానికి సంబంధించి పూర్తి నివేదికను తహసీల్దారుకు అప్పగించినట్లు ఆర్ఐ అనురాధ తెలియజేశారు. ఇంటి నిర్మాణానికి సంబంధించిన పత్రాలు ఏవైనా ఉంటే తహసీల్దారు కార్యాలయానికి తీసుకురావాలని, వాటిని పరిశీలించి న్యాయం చేస్తామని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పంచాయతి వీఆర్వో నాని తదితరులు పాల్గొన్నారు.

అల్ట్రాసౌండ్ ద్వారా ఉచిత పరీక్షలు

నందలూరు, ఆగస్టు 7: మండల పీహెచ్‌సీలో అల్ట్రాసౌండ్ ద్వారా గర్భిణీలకు ఉచిత పరీక్షలు అందుబాటులో ఉంటాయని ప్రభుత్వ వైద్యాధికారి శరత్‌కమల్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రతినెల 9, 10 తేదీల్లో గర్భవతులకు నిర్వహించే పరీక్షలతో పాటు అవసరమైన వారికి అల్ట్రాసౌండ్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 9న రాజంపేటకు చెందిన ప్రముఖ గైనకాలజిస్టు మస్తానమ్మ గర్భిణీలను పరీక్షించడానికి వస్తున్నారని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటనారాయణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ కార్యాలయం ప్రారంభం

రైల్వేకోడూరు(రూరల్), ఆగస్టు 7: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపం ఆదర్శ పాఠశాల వద్ద బుధవారం ఆటో ఓనర్స్, వర్కర్స్ యూనియన్ నూతన కార్యాలయాన్ని రైల్వేకోడూరు సీఐ టి.బాబు, ఎస్ఐ డాక్టర్ నాయక్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, కాకీ షర్టులు వేసుకోవాలని సూచించారు. మైనర్ బాలురకు ఆటో ఇస్తే ఆటో ఓనర్‌పై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. నియమ నిబంధనలతో ఆటోలు నడపాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సిద్దేశ్వర, గౌరవ అధ్యక్షుడు ఉదయ్, ఆటో యూనియన్ కమిటీ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

సీవీఎస్వో బాధ్యతల స్వీకారం



టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా శ్రీధర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకమండపంలో బుధవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించాక గర్భాలయంలోని మూల మూర్తిని దర్శించుకున్నారు.సీవీఎస్వో శ్రీధర్‌ను వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు శ్రీవారి ఫొటోతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు.అనంతరం సీవీఎస్వో ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ..టీటీడీలోని అన్ని విషయాలనూ అవగాహన చేసుకుని భక్తులకు ఇబ్బంది లేకుండా పనిచేస్తానని, ఆ శక్తిసామర్థ్యాలు ప్రసాదించాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





పొగడచెట్టుకు హారతి

పురుశైవారితోటలో మలయప్ప

భూదేవి అంశగా ఆండాళ్(గోదాదేవి) ఆవిర్భవించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది కూడా టీటీడీ తిరువాడిపురం శాత్తుమొరను వేడుకగా నిర్వహించింది.ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి ఆలయ వెనుకభాగంలోని పురుశైవారి తోటకు వేంచేశారు.నివేదనల అనంతరం స్వామి, అమ్మవార్లు ఊరేగింపుగా తిరిగి ఆలయానికి బయల్దేరారు. మార్గమధ్యంలో పొగడచెట్టుకు హారతి, పుష్పమాల, శఠారి సమర్పించారు. శఠారీకి అభిషేకం నిర్వహించిన అనంతరం స్వామి, అమ్మవార్లు మాడవీధుల గుండా ఆలయానికి చేరుకున్నారు.ఆలయ పేష్కార్ శ్రీహరి, పారుపత్తేదార్ బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి

అంతరిక్షంపై అవగాహన పెంచుకోండి

అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థులు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకొంటే శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఎంతో దోహదపడుతుందని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవాల్లో భాగంగా బుధవారం షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాల్లో విద్యార్థులకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా అంతరిక్ష ప్రయోగాలు, ఇస్రో రూపొందించే ఉపగ్రహాలను గురించి విద్యార్థులకు షార్ డైరెక్టర్ వివరించారు. సమాజం కోసం ఇస్రో చేపడుతున్న ప్రయోగాలు, కార్యక్రమాల్లో విద్యార్థులు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అనంతరం అంతరిక్ష ప్రయోగాల గురించి చంద్రయాన్-3 అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ కల్పన చంద్రయాన్ వివరించారు.శాస్త్రవేత్తలు రఘురామ్, శంభుప్రసాద్, సీవీఎస్ కిరణ్, షార్ గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- సూళ్లూరుపేట





సమావేశంలో ప్రసంగిస్తున్న షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్

రక్తమోడిన తిరుమల ఘాట్

- బస్సు కిందపడి ఇద్దరు తమిళనాడువాసుల దుర్మరణం



బస్సు కింద, పక్కన మృతదేహాలు

తిరుమల, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో ప్రకృతి అందాల నడుమ దర్శనమిచ్చే తిరుమల ఘాట్‌రోడ్డు బుధవారం మధ్యాహ్నం రక్తపు మరకలతో భయానకంగా మారింది. స్వామి క్షేత్రానికి చేరుకున్నామని ఆనందపడుతున్న భక్తులను ఆగిన బస్సు, దాని కింద రెండు మృతదేహాలు ఆందోళనకు గురిచేశాయి.మొదటిఘాట్ రోడ్డులోని చివరి మలుపు అంటే తిరుమలకు జీఎన్సీ టోల్‌గేట్‌కు సమీప ప్రాంతంలో తమిళనాడుకు చెందిన ఓ యువకుడు, యువతి బైక్‌పై ప్రయాణిస్తూ ముందు వెళుతున్న ఎలక్ట్రిక్ ఏసీ బస్సు కింద పడి ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాల వద్ద లభించిన గుర్తింపుకార్డుల ఆధారంగా బైక్ నడుపుతున్న వ్యక్తి తమిళనాడులోని పల్లిపట్టు తాలూకా వెలియాగరం గ్రామానికి చెందిన ఏఎస్ కార్తీక్(28)గా తేలింది. ఇక, వెనుకభాగంలో కూర్చుని మృతి చెందిన మహిళ తిరువన్నామలై జిల్లాలోని చెంజాం తాలూకా, మషర్ గ్రామానికి చెందిన సౌమ్య(21)గా పోలీసులు గుర్తించారు. ఉదయం 10.45 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకోగా, మధ్యాహ్నం తర్వాత మృతదేహాలను పోలీసులు, హెల్త్ సిబ్బంది బస్సు కింద నుంచి తొలగించి అశ్విని ఆస్పత్రికి తరలించారు.అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తిరుపతిలోని రుయాస్పత్రికి తరలించారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్ సంఘటనాస్థలికి చేరుకుని ప్రమాదం గురించి ఆరా తీశారు. ప్రమాదం జరిగిన నేపథ్యంలో బస్సు డ్రైవర్ కాంతారావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదం ఎలా జరిగిందనే అంశాలపై ఆరా తీస్తున్నారు.కాంతారావు మీడియాతో మాట్లాడుతూ.. బైక్‌పై వచ్చిన వారు తొలుత రైట్‌లో వచ్చేందుకు ప్రయత్నించి తర్వాత వేగంగా ఎడమవైపుకు వచ్చారని తెలిపారు. కనీసం హార్న్ కూడా కొట్టలేదని, బస్సును ఢీకొట్టి వారే కిందకు వెళ్లిపోయారన్నారు. మలుపు కావడంతో బస్సును వేగంగా కూడా నడపలేదని, బైక్‌పై వచ్చిన వారే మితిమీరిన వేగంతో వచ్చారని వివరించాడు. బస్సు ప్రమాదానికి కారణం ఎవరనే అంశంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.కాగా కొద్దిరోజులుగా ఏసీ బస్సులు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయనే ఆరోపణలున్నాయి. ముందు వెళుతున్న కార్లను, ద్విచక్రవాహనాలను సైతం ఓవర్‌టేక్ చేస్తున్నాయనే ఫిర్యాదులున్నాయి. భక్తుల కార్లతో పాటు టీటీడీ అధికారుల వాహనాలకు కూడా సైడ్ ఇవ్వకుండా మొండిగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వచ్చాయి.పర్యావరణ పరిరక్షణ నినాదంతో తిరుమల-తిరుపతి మధ్య ఎలక్ట్రికల్ ఏసీ బస్సులను తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం 62 ఎలక్ట్రికల్ ఏసీ బస్సులు నడుస్తున్నాయి. వీటి డ్రైవర్లను బస్సు తయారీ సంస్థ అవుట్‌సోర్సింగ్ ద్వారా నియమించుకుంది. వీరికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చినప్పటికీ ర్యాష్ డ్రైవింగ్‌తో విమర్శలపాలవుతున్నారు. ఈ అంశంపై ఆంధ్రజ్యోతిలో గతనెల 11వ తేదీన 'తిరుమల ఘాట్‌లో ఏసీ బస్సుల దూకుడు' అనే శీర్షికన కథనం కూడా ప్రచురితమైంది. అయినప్పటికీ వారి తీరులో మాత్రం ఎలాంటి మార్పు రాకపోవడం గమనార్హం.ఎలక్ట్రిక్ బస్సులన్నిటికీ ముందు, వెనుకభాగంలో సీసీ కెమెరాలున్నప్పటికీ వాటిని ఆన్ చేయకుండా బస్సులు నడుపుతున్నట్లు బుధవారం జరిగిన ఘటనతో వెలుగు చూసింది.



బస్సు డ్రైవరును విచారిస్తున్న పోలీసులు

భాకరాపేట ఘాట్‌లో నడిరోడ్డుపై లారీ బోల్తా

చంద్రగిరి ఆగస్టు 7: చంద్రగిరి మండలం భాకరాపేట ఘాట్‌లో బుధవారం సాయంత్రం నడిరోడ్డుపై ఓ లారీ బోల్తా పడడంతో ఒకరు మృతి చెందగా నలుగురికి గాయాలయ్యాయి.వరదయ్య పాళెం మండలం కలత్తూరుకు చెందిన 11మంది వ్యాపారులు, కూలీలు ఎర్రావారిపాళ్యం మండలం వెళ్లారు.ఆ మండలంలోని పలు గ్రామాల్లో వరిధాన్యం సేకరించి లారీలో వేసుకొని వస్తుండగా భాకరాపేట ఘాట్‌లో అదుపుతప్పి రోడ్డుపై లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నవీన్ కుమార్(27) అక్కడికక్కడే మృతిచెందాడు. నల్లయ్య, మునిభూషణం, మణి, బాలయ్య గాయపడ్డారు. నవీన్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో తిరుపతి రుయాస్పత్రికి తీసుకెళ్లారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





బోల్తా పడిన లారీ (ఇన్‌సెట్‌లో) నవీన్ కుమార్ మృతదేహం

బోనమందలో ఏనుగుల హల్ చల్

సోమల, ఆగస్టు 7: పేటూరు పంచాయతీ బోనమంద సమీపంలో బుధవారం పట్టపగలు ఏనుగుల గుంపు హల్ చల్ చేసింది. పెద్దఉప్పరపల్లె రైతులు పొలాలకు వెళ్తుండగా రోడ్డుపై ఏనుగుల గుంపును చూశారు. వెంటనే వెనుతిరిగి వచ్చేశారు. దుర్గం కొండ అడవుల్లో నీటి నిల్వల కోసం ఆ ప్రాంతంలోనే ఇవి మకాం వేసినట్లు రైతులు భావిస్తున్నారు. కొన్ని మామిడి తోటల్లో కాయలు కోతలు కోయాల్సి ఉన్న నేపథ్యంలో వీరు ఆందోళన చెందుతున్నారు. మందుల పిచికారీతో కోతలు ఆలస్యవుతున్నాయంటున్నారు.

నేటి నుంచి సర్పంచి, కార్యదర్శులకు శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 7: రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ 2024-25 వార్షిక కార్యాచరణ ప్రణాళికపై తొలి విడతలో గురువారం నుంచి మూడ్రోజులపాటు మండల స్థాయిలో సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు జరుగుతాయని జిల్లా పంచాయతీ వనరుల కేంద్ర కో-ఆర్డినేటర్ ఐ.ఆర్.షణ్ముగం తెలిపారు. పంచాయతీల్లో పారిశుధ్యం, ఎల్ఈడీ వీధి దీపాలు, ఘన, వ్యర్థ పదార్థాల నిర్వహణ అంశాలపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. రెండో విడత శిక్షణా తరగతులు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు.

పీఎం ఆవాస్ యోజన లక్ష్యం పూర్తి చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 7: జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన వంద రోజుల ప్రణాళికలో భాగంగా నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం రాత్రి కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో హౌసింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీఎం ఆవాస్ యోజన గృహ నిర్మాణాలకు నిధుల కొరత లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న 22,125 గృహాల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు ఆర్థిక సాయం చేస్తే లబ్ధిదారులు ఆసక్తి చూపుతారని అధికారులు చెప్పడంతో మెప్మా, డీఆర్డీఏ ద్వారా ఎస్‌హెచ్‌జీ మహిళలకు రుణాలు మంజూరుచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. హౌసింగ్ పీడీ పద్మనాభం, ఈఈలు, డీఈలు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఎంపీడీవోలు వెనక్కి

చిత్తూరు రూరల్, ఆగస్టు 7: ఎన్నికలకు ముందు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన ఎంపీడీవోలకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. వారిని తిరిగి సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు నుంచి నెల్లూరు, కడప జిల్లాలకు వెళ్లిన 30 మంది ఎంపీడీవోలు వారి స్థానాల్లో రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం



చేనేత కార్మికులను సన్మానిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 7: చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి అవసరమైన యంత్రాలు, షెడ్ల ఏర్పాటుకు ఆర్థికసాయం చేయడానికి కృషి చేస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో 10వ జాతీయ చేనేత దినోత్సవం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. చేనేత కార్మికులు తయారు చేసే నాణ్యమైన ఉత్పత్తులపై వినియోగదారులకు అవగాహన పెంచి మార్కెటింగ్ సౌకర్యం కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. నిరుపేద చేనేత కార్మికులకు ఆరోగ్యభద్రత, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టరేట్, ప్రభుత్వాస్పత్రులు, జడ్పీ, ఎంపీడీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. 10మంది నేతన్నలను కలెక్టర్ సన్మానించారు. చేనేత శాఖ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

30మందికి వాంతులు, విరేచనాలు



ఇళ్ల వద్దనే వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

బంగారుపాళ్యం, ఆగస్టు 7: బంగారుపాళ్యం దళితవాడలో 30 మందికి వాంతులు, విరేచనాలు కావడంతో వైద్య సిబ్బంది ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసి, చికిత్స అందిస్తున్నారు. రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు నీరు కలుషితమై కొందరికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి, ప్రైవేటు ఆస్పత్రులలో కొందరు చికిత్స పొందుతున్నారు. మరికొందరికి గ్రామంలోనే క్యాంపు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. బుధవారం జిల్లా వైద్యాధికారి ప్రభావతిదేవి గ్రామాన్ని సందర్శించారు. రోగులతో మాట్లాడి వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. నీటి శాంపిల్‌ను పరిశీలించడానికి తిరుపతి ల్యాబ్‌కు పంపినట్లు డాక్టర్ లోహిత్ చెంగల్రాయన్ తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మురళీమోహన్ డీఎం అండ్‌హెచ్‌వో ప్రభావతితో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వారికి మెరుగైన సేవలందించాలని కోరారు.

సీఐ అక్రమాలపై విచారణ జరపండి



డీఎస్పీ కార్యాలయం వెలుపల మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పలమనేరు, ఆగస్టు 7: పలమనేరు సీఐ చంద్రశేఖర్ అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండు చేశారు. తమతో పాటు అమాయకులను వేధించడంపైనా విచారించాలన్నారు. ఈ మేరకు వీరు బుధవారం పలమనేరు డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. సోమవారం ఎస్పీని కలిసి 'స్పందన' కార్యక్రమం లో ఫిర్యాదు చేశామని తెలిపారు. వైసీపీ పాలనలో ఇసుక అక్రమంగా తరలించినా సీఐ పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు ఇసుక ఉచితమని పదేపదే చెబుతున్నా తాము ఇళ్ల నిర్మాణాలకు ఇసుక తీసుకొస్తుంటే పట్టుకొని కేసులు నమోదు చేస్తామని వేధిస్తున్నారన్నారు. వెంటనే సీఐ చంద్రశేఖర్‌ను సస్పెండ్‌చేసి, అతని అక్రమాలపై విచారణ జరపాలన్నారు. టీడీపీ నాయకులు నాగరాజు, నాగరాజరెడ్డి, పెద్దబ్బ, ఖాజాపీర్, చిన్ని, సుబ్బు, లోకేష్‌ఆచారి, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

బదిలీలో జాప్యం ఎందుకో?

పలమనేరు సీఐ చంద్రశేఖర్ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడికి పోస్టింగ్ తెచ్చుకొన్నారు. గతంలోనూ ఈయన ఇక్కడ ఎస్ఐగా, సీఐగా పనిచేస్తూ అధికార వైసీపీకి అంటకాగారు. ఆ పార్టీకి కొమ్ముకాస్తున్నారని ఆయనపై ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో శాంతిపురానికి చెందిన జనార్దన నాయుడు క్వారీని అక్రమంగా అప్పటి ఎమ్మెల్యే స్వాధీనం చేసుకొన్నా సీఐ పట్టించుకోలేదు. ఇప్పుడు వైసీపీ అధికారం కోల్పోయిన తరువాత తనక్వారీ లోని వాహనాలను సైతం మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ తరలించుకుపోయారని జనార్దన నాయుడు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు. దీంతో ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఫిర్యాదు చేశారు. ఈ కేసు విషయమై ఎస్పీ నుంచి ఆదేశాలు వచ్చినా కేసు నమోదు చేయలేదు. ఇంతలా వైసీపీ ముద్రవేసుకొన్న సీఐ చంద్రశేఖర్‌ను ప్రభుత్వం ఎందుకు బదిలీ చేయలేదనే చర్చ ప్రారంభమైంది. సాధారణంగా అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నారంటూ ప్రతిపక్షనాయకులు ఆరోపణలు చేయడం, నిరసన కార్యక్రమాలు చేపట్టడం సర్వసాధారణం. ఇక్కడ మాత్రం ఇందుకు భిన్నంగా అధికారపార్టీ నాయకులే సీఐపై ఫిర్యాదులు, నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. అయినా సీఐ బదిలీ జరగక పోవడం విశేషం. కర్నూలు రేంజిలోని 92 మంది సీఐలను బదిలీ చేసినా.. అందులో పలమనేరు సీఐ లేకపోవడంపై టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారు. తన నియోజకవర్గంలోని ఈ పరిస్థితిపై ఎమ్మెల్యే, మాజీ మంత్రి అమరనాథరెడ్డి పట్టించుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది.

వలంటీర్ల వాట్సప్ గ్రూపులు తొలగింపు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 7: గ్రామ, వార్డు వలంటీర్లు (విధుల్లో ఉన్న.. రాజీనామా చేసిన.. తొలగించిన)కు సంబంధించి వారి హౌస్‌హోల్డ్ పరిధిలో ప్రజలతో ఏర్పాటు చేసుకున్న వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపులన్నిటినీ వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీఅయ్యాయి. గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన వలంటీర్ల వ్యవస్థ ద్వారా జిల్లాలో 9412 మంది విధుల్లో ఉన్నారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల సందర్భంగా 5298 మంది రాజీనామా చేయగా, 4114 మంది ప్రస్తుతం విధుల్లో కొనసాగుతున్నారు. వీరికి ఎటువంటి బాధ్యతలను ప్రభుత్వం అప్పగించలేదు. ఈ నేపథ్యంలో వలంటీర్లకు సంబంధించిన గ్రూపులను వెంటనే డిలీట్ చేయడంతో పాటు సంబంధిత సమాచారాన్ని వెంటనే అందజేయాలని ఆదేశాలు జారీఅయ్యాయి. ఈ సమాచారాన్ని గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా ప్రజలకు చేరవేయాలని కూడా అందులో పేర్కొన్నారు. గతంలో పెన్షన్లు వలంటీర్ల ద్వారా వైసీపీ ప్రభుత్వం పంపిణీ చేసేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండు నెలలకు సంబంధించిన పెన్షన్లను వలంటీర్లు లేకుండానే సచివాలయ సిబ్బందితో పాటు ఇతర శాఖలకు సంబంధించిన ఉద్యోగులతో పంపిణీ చేసింది. ఈ నేపథ్యంలో వలంటీర్లకు సంబంధించిన గ్రూపులను తొలగించాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.70 కోట్లు

తిరుమల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.70కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 66,235 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 26,730 మంది తలనీలాలు సమర్పించారు.

వాన దంచేసింది

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 7: నైరుతి రుతుపవనాల కారణంగా జిల్లా అంతటా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. బుధవారం ఉదయం నుంచి ఆకాశంలో మబ్బులు కమ్ముకుని వాతావరణం మారింది. ఈ ఒక్క రోజే 16.8 మి.మీ సరాసరి వర్షపాతం నమోదైంది. నగరి, నింద్ర, విజయపురం మండలాలు మినహాయించి 29 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా వి.కోటలో 83.2, అత్యల్పంగా పాలసముద్రం, చిత్తూరులో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. పులిచెర్ల 61.2, రొంపిచెర్ల 44.6, సదుం 42.2, గంగవరం 35.4, బైరెడ్డిపల్లి 35.2, చౌడేపల్లి 34.2, సోమల 24.2, ఐరాల 23.2, వెదురుకుప్పం 20.4, పలమనేరు 16.6, తవణంపల్లె 16.2, పెనుమూరు 15.8, బంగారుపాళ్యం 14.6, గుడుపల్లి 9.2, పూతలపట్టు 9.0, కార్వేటినగరం 7.2, రామకుప్పం 6.8, పుంగనూరు 6.2, గుడిపాల 6.2, పెద్దపంజాణీ, గంగాధరనెల్లూరు 4.2, యాదమరి 3.2, చిత్తూరు రూరల్ 3.0, శాంతిపురం 2.8, శ్రీరంగరాజపురం 2.6, కుప్పంలో 2.0 మి.మీ కురిసింది. గతంలో వేసిన వరినాట్లకు ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

గుర్రంకొండ, ఆగస్టు 7:పాఠశాలల్లో పాఠ్యాంశాలను విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఉపాధ్యాయులకు సూచించారు. గుర్రంకొండ జడ్పీ హైస్కూల్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల్లో ఓ ఉపాధ్యాయుడు టీ షర్ట్, జీన్స్ ఫ్యాంట్ వేసుకొని రావడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు డ్రెస్ కోడ్ తప్పకుండా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. ఉపాధ్యాయుల పనితీరు సరిగాలేదని తన దృష్టికి వచ్చిందని మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంఈవో సురేంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్ర నిర్వహణపై అసహనం

బి.కొత్తకోట, ఆగస్టు7: బి.కొత్తకోట మండలంలోని కోటావూరు పంచాయతీ పరిధిలోని కాండ్లమడుగు అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ శ్రీధర్ తనిఖీ చేసి కేంద్రం నిర్వహణపై అసహనం వ్యక్తం చేశారు. బుధవారం జేసీ ఆదర్శరాజేం ద్ర, మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ లతో కలిసి అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేయగా రిజిస్టరులో 8మంది, సెంటరులో నలుగురు ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలపై దృష్టి పెట్టాలని సబ్‌కలెక్టర్‌ను ఆదేశించారు.

ఎంఎల్ఎస్ పాయింట్లలో తూకాలు సరిగ్గా ఉండాలి

మదనపల్లె టౌన్, ఆగస్టు 7: సివిల్ సప్లైస్ గోదాముల్లో చౌకదుకాణాలకు పంపే వస్తువులు, బియ్యం తదితర వాటి తూకాలు సక్రమంగా ఉండేలా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ సూచించారు. బుధవారం స్థానిక సివిల్ సప్లైస్ గోదాములో స్టాక్ రిజిస్టర్‌లోని వివరాలు, స్టాకును పరిశీలించారు. సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ శివరామ్, తహసీల్దార్ ఖాజాబి, గోదాము డీటీ పాల్గొన్నారు.

ఫ్రీ హోల్డ్ భూములపై పకడ్బందీగా విచారణ చేపట్టండి

కురబలకోట, ఆగస్టు 7: ఫ్రీ హోల్డ్ భూములపై పకడ్బందీగా విచారణ చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని కురబలకోట తహసీల్దార్ కార్యాలయాన్ని జేసీ ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. అనంతరం రికార్డు రూమును పరిశీలించి జాగ్రత్తగా భద్రపరచుకోవాలని తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రలో వైద్య సేవలపై సబ్‌కలెక్టర్ ఆరా

నిమ్మనపల్లి, ఆగస్టు 7: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆకస్మిక తనిఖీ చేసి ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ ఆపరేషన్ చేసేందుకు డాక్టర్ లేరని, రోజుకు 180 మంది వరకు రోగులు ఆసుత్రికి వస్తున్నారని తెలిపారు. అనంతరం అక్కడ ఉన్న రోగులు రాత్రి సమయంలో ఎవ్వరూ ఉండడం లేదని గంటల కొద్ది తలుపు కొట్టినా స్పందన లేదని సబ్‌కలెక్టర్‌కు తెలి పారు. కార్యక్రమం లో తహసీల్దార్ ధనంజేయులు, ఆర్ఐ రాంప్రసాద్ పాల్గొన్నారు.

గంజాయి అమ్మకాన్ని అరికడతాం

మదనపల్లె అర్బన్ 7 : పట్టణంలో యువత ఎక్కువగా గంజాయి తాగుతున్నారని వాటిని పూర్తిగా అరికడతామని డీఎస్పీ కొండయ్య నాయుడు తెలిపారు. మదనపల్లెలో బుధవారం డీఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ , కాలేజీలు , స్కూళ్లు పరిసర ప్రాంతాలలో సిగరెట్ , బీడీ, గుట్కా వంటివి అమ్మకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా భూఆక్రమణలకు పాల్పడిన వారి పైన కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. మదనపల్లె ట్రాఫిక్‌పైన దృష్టి పెట్టి రికార్డులు లేని వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు.

చేనేత కార్మికులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

బి.కొత్తకోట, ఆగస్టు7: గత ప్రభుత్వ విధానాల వల్ల నిర్లక్ష్యానికి గురైన చేనేత రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ డిమాండ్ చేశారు. బుధవారం జాతీయ చేనేత కార్మికుల దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ రోజురోజుకు ప్రాధాన్యత కోల్పోతున్న చేనేత రంగాన్ని కాపాడాలని, కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధులను విడుదల చేయడంతో పాటు, వీవర్స్ కాలనీలను ఏర్పాటు చయ్యాలని కోరారు. సీనియర్ కార్మకులను సన్మానించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

రవీంద్రనాథ్ ఠాగూర్ అడుగు జాడల్లో నడుద్దాం

మదనపల్లె టౌన్, ఆగస్టు 7: విశ్వకవి రవీం ద్రనాథ్ ఠాగూర్ అడుగుజాడల్లో నడుద్దామని ఉన్నత విద్యాశాఖ ఆర్‌జేడీ డాక్టర్ బాబు పేర్కొన్నారు. బుధవారం స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రవీంద్ర నాథ్ ఠాగూర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసిఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆర్‌జేడీ మా ట్లాడుతూ బీటీ కళాశాలలో 1912 సంవ త్సరంలోనే ఐదు రోజుల పాటు బస చేసిన రవీంద్రనాథ్ ఠాగూర్ జాతీయగీతాన్ని బెంగాలీ నుంచి ఆంగ్లంలోకి అనువదించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణవేణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కురబలకోట, ఆగస్టు 7: రోడ్డు ప్రమాదంలో నాని(20) అనే యువకుడు అక్కడిక్కడే మృతి చెందగా, మరో యువకుడు తీవ్ర గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు తంబళ్ళపల్లె మండలం కొటాలకు చెందిన ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంలో వెళుతుండగా బి.కొత్తకోట వైపు నుంచి వేగంగా వస్తున్న కారు వారి వాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో నాని అక్కడిక్కడే మృతి చెందగా, మరో యువకుడు రఘునాయక్(21)తీవ్రంగా గాయపడగా అతన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీతాలు చెల్లించాలంటూ కార్మికుల ధర్నా

పీలేరు, ఆగస్టు 7: మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న తమ జీతాలు వెంటనే చెల్లించాలంటూ పీలేరు గ్రామ పంచాయతీలోని కార్మికులు బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటరామయ్య మాట్లాడుతూ పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 100 మంది కార్మికులు పనిచేస్తుండగా గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా అధికారులు కార్మికులను వేధిస్తున్నారన్నారు.

వడ్డిపల్లె గంగమ్మ ఆలయంలో చోరీ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 7: స్థానిక రంగారెడ్డి కాలనీ సమీపంలోని వడ్డిపల్లెలో గంగమ్మ ఆలయంలో బుధవారం దొంగలు పడి అమ్మకు అలంకరించి న బంగారు, వెండి ఆబరణాలు దొంగలించారని నిర్వహకులు తెలిపారు. ఆలయ నిర్వహకులు పిర్యాదు మేరకు వన్ టౌన్ సీఐ చాంద్‌బాషా అక్కడికి వెళ్లి పరిశీలించి కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే పుంగనూరు రోడ్డు బసినికొండ సమీపంలో గోపాల్ నాయక్ ఇంట్లో దొంగలు పడి తాళాలను పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. బుధవారం ఇంట్లో ఎవ్వరూలేని సమయం బీరువాలో ఉన్న రూ.3 వేలు దోచుకెళ్లారు. ఆ మేరకు ఫిర్యాదు అందడంతో వన్ టౌన్ సీఐ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.